క్లుప్తంగా

హెల్త్ సూపర్‌వైజర్‌కు ఉద్యోగోన్నతి



మంగళగిరి (తాడేపల్లి రూరల్) : మంగళగిరి పట్టణ పరిధిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్ వెలగపూడి జయలక్ష్మికి ఉద్యోగోన్నతి లభించినట్లు శనివారం ఓ ప్రకటనలో యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది తెలియజేశారు. కొంతకాలంగా సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న జయలక్ష్మిని నెల్లూ జిల్లాకు పీహెచ్‌ఎన్‌గా బదిలీ చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ సుచరిత ఉత్తర్వులు జారీ చేశారన్నారు. గత 33 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖలో నూతక్కి, పెదవడ్లపూడి పీహెచ్‌సీలలో ఏఎన్ఎంగా, గిద్దలూరు మండలం సంజీవరావుపేట, మంగళగిరి గణపతి రావు నగర్‌లోని ఇందిరానగర్ హెల్త్ సెంటర్‌లో హెల్త్ సూపర్‌వైజర్‌గా ఆమె విశేష సేవలు అందించి ప్రజల మన్ననలు పొందినట్లు వైద్య సిబ్బంది తెలియజేశారు.

ఇండస్ట్రియల్ పార్క్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి నగర పరిధిలోని యర్రబాలెం ఇండస్ట్రియల్ పార్క్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా సరికొండ రామరాజు, కార్యదర్శిగా బహదూర్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడిగా ఎం.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా చీదెళ్ల శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా షేక్ సలీమ్, ఎం. వంశీకృష్ణ, వై.బాల శివారెడ్డి, కోలా వెంకట రమణ ఎన్నికైనట్లు సభ్యులు తెలియజేశారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి



తాడికొండ: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని మంగళవారం నిర్వహించారు. తాడికొండ మహిళా గ్రంథాయలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారిణి ఎ.నాగమల్లేశ్వరి, శేషగిరిమ్మ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గోకులం షెడ్డు ప్రారంభం




పొన్నెకల్లు(తాడికొండ): పొన్నెకల్లు గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.2 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డుని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ శనివారం ప్రారంభించారు. పశుపోషకులకు ప్రయోజనకరంగా ఉండేలా నిధులు అనుసంధానం చేయడం హర్షణీయమన్నారు. ఎంపీడీవో కె.సమతావాణి, టీడీపీ నాయకులు మధుసూదనరావు, తలశిల ప్రసన్న పాల్గొన్నారు.

చెప్పి వెళ్లండి..!

పెద్దల మాట చద్దన్నం మూట అంటారు. ఇంటి నుంచి బయటకెళ్తున్నప్పుడు పెద్దలు ఒక మాట చెప్పి వెళ్లమంటారు. ఎక్కడికెళ్తున్నారో తెలిస్తే ఎప్పుడు తిరిగొస్తారో, ఆలస్యమైతే ఎవరిని విచారించాలో ఒక అవగాహన ఉంటుంది. ఇప్పుడు సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లే నగర వాసులకు ఈ మాట వర్తిస్తుంది. ఊరెళ్లే ముందు స్థానిక పోలీస్ స్టేషన్‌లో చెప్పి వెళ్లండి. వారు మీకు ఎల్‌హెచ్ఎంఎస్ అనే ఎలక్ట్రానిక్ డివైజ్ ఇస్తారు. అది తాళం వేసిన ఇంటిలో ఏర్పాటు చేస్తారు. ఎవరూలేనప్పుడు ఇంటిలో దొంగలు పడితే అటు పోలీసులను, మిమ్మల్నీ అలర్ట్ చేస్తుంది. అలాగే గస్తీకి అవకాశముంటుంది. పోలీసుల సూచనలూ పాటించండి.

- మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో పెరిగిన దొంగల బెడద
- సంక్రాంతికి ఊరెళ్లే వారి ఇళ్లపై చోరుల కన్ను
- స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారమిస్తే భద్రత
- ఖాళీ ఇంటి వద్ద గస్తీ నిర్వహించేందుకు అవకాశం
- లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటుతో పూర్తి నిశ్చింత



మంగళగిరి (తాడేపల్లిరూరల్): సంక్రాంతి పండగ సందడి మొదలైంది. కొత్త వస్త్రాలు, షాపింగ్‌లతో ప్రజలు తీరిక లేకుండా ఉన్నారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం పట్టణ, నగరాల్లో స్థిరపడిన వారంతా సొంత ఊళ్లకు వెళ్లారు. ఇదే సమయంలో ఇంటికి తాళం వేసిన ఇళ్లపై దొంగలు ఒక కన్ను వేసి ఉంచారు. సొంత ఊళ్లకు వెళ్లేవారు ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిందేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు. లేకుంటే భారీ మూల్యం తప్పదని అంటున్నారు. పలు ప్రాంతాల్లో దొంగల బెడద ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. నగదు, బంగారు ఆభరణాలు బ్యాంకు లాకర్లలో భద్రపరచడం ఉత్తమమంటున్నారు. అలాగే ఎల్‌హెచ్ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) ఉపయోగించుకుని పండగను నిశ్చింతగా చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

పోలీసులు అప్రమత్తం

మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ పరిధిలోని మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండల పరిధిలోను కొన్ని నెలలుగా చోరీలు ఎక్కువయ్యాయి. సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో చాలామంది తమ సొంతూళ్లకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఊరికి వెళ్లేవారంతా ఇంటి చిరునామాను తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని వివరిస్తున్నారు. ఊరెళ్లే, తిరి గొచ్చే సమయాలు తేదీతో సహా తెలిపి.. యజమాని ఫోన్ నంబరు అందజేయాలని చెబుతున్నారు.

అపార్ట్‌మెంట్లలో భద్రత తప్పనిసరి

అపార్ట్ మెంట్ల వాసులు వాచ్‌మెన్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. అతడి ఫొటో, అడ్రస్ తీసుకోవాలి. కొత్తవారు వచ్చినప్పుడు వాచ్‌మెన్ ప్రశ్నించేలా అప్రమత్తం చేయాలి. రిజిస్టర్‌లో వారి పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఎక్కడకు వెళ్తున్నారో అనే వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలి. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో, ప్రవేశ ద్వారం, కారిడార్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.



ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లినప్పుడు దొంగలు పగలకొట్టిన బీరువా (ఫైల్‌ఫొటో)

సమాచారమివ్వాలి



సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లేవారు తప్పని సరిగా వారి సమాచారాన్ని పోలీసులకు అందజేయాలి. లేదా పోలీస్ యాప్ ఎల్‌హెచ్ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలి. దీంతో ఆ ప్రాంతంలో అదనపు సిబ్బందిని నియమించి చోరీలకు చెక్ పెట్టవచ్చు. అత్యవసరమైతే డయల్ 100, 1090 నంబర్లకు ఫిర్యాదు చేయాలి. ఇంటి ముందు లైట్లు వేసి ఉంచాలి, పండుగను సంతోషంగా జరుపుకోవాలి.

– మురళీకృష్ణ, నార్త్‌జోన్ డీఎస్పీ, మంగళగిరి

ఎల్‌హెచ్ఎంఎస్ అంటే...

ఊళ్లకు వెళ్లేవారు పోలీసులకు ముందస్తు సమాచారమివ్వాలి. పోలీసులు వారి నివాసాల్లో ఒక పరికరాన్ని అమరుస్తారు. ఇది ఎలక్ట్రానిక్ డివైజ్, సీసీ కెమెరా కలిగిన పరికరం. దీని కోసం మొబైల్ యాప్ అందుబాటులో ఉంటుంది. యాప్ యూజర్, కమాండ్ కంట్రోల్ రూమ్‌కు, పోలీసులకు అనుసంధానంగా పనిచేస్తుంది. ఇళ్లల్లో ఎవరూ లేనప్పుడు ఎవరైనా సంచరించినా, తాళాలు పగలగొట్టిన వెంటనే ఆ పరికరం అలర్ట్ చేస్తుంది. అటు పోలీసులకు, ఇటు యూజర్‌కు సిగ్నల్ పంపిస్తుంది. ఇప్పటికే ఈ యాప్‌ను జిల్లాలో అనేకమంది వినియోగిస్తున్నారు.

ప్రయాణాల్లో అప్రమత్తం అవసరం

ప్రయాణాల్లో విలువైన వస్తువులు బ్యాగ్‌లలో పెట్టకండి. చిన్న పిల్లలు, బ్యాగ్‌లను ఎక్కడ పడితే అక్కడ వదిలి వెళ్లొద్దు. షాపింగ్ చేసేవారు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. డబ్బుతో కూడిన బ్యాగ్‌లు ఉన్నప్పుడు జాగ్రత్తగా పట్టుకోవాలి. రద్దీగా ఉన్న ప్రాంతాల్లో జేబు దొంగలు, బంగారు ఆభరణాలు చోరీచేసేవారు ఉంటారు. చుట్టుపక్కల వారిని గమనిస్తూ ఉండాలి. కరెన్సీ నోట్లను కిందపడేసి మీ దృష్టిని మరల్చి విలువైన వస్తువులు, డబ్బులను కాజేసే అవకాశం ఉంటుంది. డిజిటల్ లావాదేవీలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వీలైనంత వరకు నగదు రహిత లావాదేవీలకు మొగ్గు చూపాలి.

పనులు కల్పించాలి

తాడేపల్లిరూరల్ : వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని దుగ్గిరాల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు అన్నారు. శనివారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం గ్రామంలో దళితుల ఆర్థిక పరిస్థితుల సర్వేలో వచ్చిన సమస్యలను గురించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద వంద రోజులు కూడా పని కల్పించడం లేదని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.300ల వేతనం ఇవ్వడం లేదన్నారు. గ్రామంలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రాజేంద్రబాబు, జి.సుధీర్, ఎస్.జ్ఞానయ్య, కె.జార్జి పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లకు దూరంగా గాలిపటాలు ఎగురవేయాలి

తాడేపల్లిరూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని గాలి పటాలు విద్యుత్ తీగలకు దూరంగా ఎగరవేయాలని మంగళగిరి విద్యుత్ శాఖ ఏడీఈ సురేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలు, పెద్దలు పతంగులు ఎగురవేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. రెండు రోజుల క్రితం లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి సమీపంలో గాలిపటాలు ఎగురవేసేటప్పుడు అవి తెగి విద్యుత్ తీగలపై పడి రెండు విద్యుత్ వైర్లపై పడడంతో హెవీ ఫ్లేమ్స్ వచ్చాయని, వాటి వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

తుది పోరుకు తాడేపల్లి సూపర్ లీగ్

తాడేపల్లిరూరల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఉండవల్లి దేవుడి మాన్యం గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న తాడేపల్లి సూపర్ లీగ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం తుదిపోరుకు చేరుకుంది. నిర్వాహకులు జొన్న రాజేష్, గాదె వినయ్ మాట్లాడుతూ ఐదో రోజు క్వార్టర్ ఫైనల్స్‌లో ఆరు మ్యాచ్‌లు జరిగాయన్నారు. నరసింహ సీసీ, ఫ్యాక్టరీ సీసీ, కేపీఎల్ వారియర్స్, తేజ 11 విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయన్నారు. ఆదివారం ఉదయం సెమీ ఫైనల్స్ నిర్వహించి, సాయంత్రం ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తామని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

తాడేపల్లిరూరల్: కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రవీణా నూతలపాటి మాట్లాడుతూ యూనివర్శిటీ సీఎస్ఐటీ, సీఎస్ఈ హానర్స్ ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, అపరిశుభ్రంగా ఉంటే వ్యాధుల గురించి అవగాహన కల్పించినట్లు ఆమె పేర్కొన్నారు. ఇంటిలోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించుకుని, పరిసరాలను డ్రైగా ఉంచుకోవాలన్నారు. సీఎస్ఐటీ, సీఎస్ఈ హానర్స్ విభాగాధిపతులు డాక్టర్ కె.అమరేంద్ర, డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ మురుగు నీరు నిల్వ ఉంటే డెంగీ, మలేరియా, చికెన్ గున్యా జ్వరాలు వచ్చే అవకాశం ఉందని సూచించారు. పాల్గొన్న వలంటీర్లను సమన్వయ కర్త పి.సురేష్‌ను యూనివర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.



అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

సైబర్ మోసాలపై అవగాహన

తాడేపల్లిరూరల్: పెట్టుబడి పెట్టండి అనూహ్య లాభాలు పొందండి అంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింకులను క్లిక్ చేసి మోసపోవద్దని కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ సూచించారు. శనివారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ విభాగం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డేటా సైన్స్ ఆధ్వర్యంలో తాడేపల్లి రూరల్ ఇప్పటం గ్రామంలో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు సైబర్ మోసాలపై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఏఐ మరియు డీఎస్ విభాగాధిపతి డాక్టర్ తిరుపతి రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి. జోనితిన్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను చూసి మోసపోవద్దని, పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టే సమయంలో ఆ కంపెనీల వివరాలు పరిశీలించాలన్నారు. సమన్వయ కర్త పి.సురేష్‌ను, వాలంటీర్లను కెఎల్‌యూ వీసీ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి తదితరులు అభినందించారు.

జీవనశైలి మార్పుతో మంచి ఆరోగ్యం

తాడేపల్లిరూరల్ : మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం వంటి శారీరక శ్రమ జీవన శైలిని అలవర్చుకుంటే మంచి ఆరోగ్యం పొందవచ్చని కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. శనివారం వర్శిటీలో యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కిడ్నీ వ్యాధి వైద్య నిపుణుడు డాక్టర్ జగన్ మోహన్ వేములపల్లి వర్శిటీ ఉద్యోగులకు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాబీ క్లబ్ ప్రొఫెసర్ ఇన్‌చార్జి ఆర్.సుభాకర్ రాజు మాట్లాడుతూ అమెరికాలో వైద్య వృత్తిలో స్థిరపడిన జగన్ మోహన్ మాతృదేశం పట్ల ఉన్న మమకారంతో భారతదేశానికి వచ్చి తమ వర్శిటీలోని ఉద్యోగులకు వైద్య సేవలు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం డాక్టర్ జగన్ మోహన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్ ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, యూత్ రెడ్ క్రాస్ ప్రొఫెసర్ ఇన్‌చార్జి సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ జగన్ మోహన్‌ను సత్కరిస్తున్న డాక్టర్ రవీంద్రనాథ్, ఆర్ సుభాకరరాజు

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

తాడేపల్లిరూరల్: స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలను శనివారం తాడేపల్లి ప్రకాష్ నగర్‌లో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వడ్డే ఓబన్న చిత్రానికి వడ్డెర సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ మొదటితరం స్వాతంత్ర్య సమరయోధుడిగా పేరుగాంచిన వడ్డే ఓబన్న.. స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సైనిక అధ్యక్షుడిగా పనిచేస్తూ రైతులపై బ్రిటీష్ వారు విధించిన పన్నులకు వ్యతిరేకంగా 1845లో ఉద్యమం కొనసాగించారన్నారు. వడ్డే ఓబన్న జయంతిని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు అధికారికంగా జరపాలని నిర్ణయించడం పట్ల వడ్డె సంఘం నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రకాష్ నగర్‌లో వడ్డెరలకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కుంచాల శ్రీనివాస్, ఉప్పు నాగరాజు, తురక రామారావు, తురక లవ్ కుమార్, పారేపల్లి రామకృష్ణ, సుధాకర్, రాజు, బోసు రాంబాబు, ఉప్పు నాగరాజు, సభ్యులు టీడీపీ తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

17న ధర్నాను జయప్రదం చేయాలి

తాడేపల్లిరూరల్ : రైతాంగ సమస్యలపై ఈ నెల 17న విజయవాడలోని ధర్నా చౌక్ నందు నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. శనివారం ఉండవల్లి సెంటర్ ప్రజా సంఘాల కార్యాలయంలో రాజధాని రైతు సంఘం కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శివశంకరరావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతాంగానికి పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తానని వాగ్దానం చేసిందన్నారు. కానీ ఖరీఫ్ ముగిసి రబీ ప్రారంభమై సగ కాలం దాటినా ఇంత వరకు పెట్టుబడి సాయం రైతులకు అందలేదని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై నిర్వహించనున్న ధర్నాకు రైతులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు. రైతు సంఘం రాజధాని అధ్యక్షులు కె.ఈశ్వర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు టి. భక్తిరెడ్డి, పి. వీరాస్వామి, వీర్ల వెంకయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

జూదం ఆడితే కఠిన చర్యలు తప్పవు

పట్టణ సీఐ వినోద్ కుమార్

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా జూదమాడినా, కోడి పందేలు నిర్వహించినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంగళగిరి పట్టణ సీఐ వినోద్ కుమార్ శనివారం తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనరాదని హెచ్చరించారు. పండుగల వేళ ప్రత్యేక బృందాలతో గస్తీ నిర్వహిస్తామన్నారు. కుటుంబ సమేతంగా మంచి వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

తెనాలిరూరల్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని నందివెలుగు, కొలకలూరు గ్రామాల్లో నిర్మించనున్న సీసీ రోడ్లకు మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎంపీడీవో అత్తోట దీప్తి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

బాపట్ల: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముత్తాయిపాలెంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గవిని వెంకట సాయి(23) హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తూ సంక్రాంతికి ఇంటికి వచ్చాడు. బంధువులతో కలిసి మెలిసి ఉంటూ శనివారం ఉదయం గొడ్లచావిడిలో ఉరివేసుకుని మృతి చెందాడు. కేసును రూరల్ సీఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

తూములూరు(కొల్లిపర): యువతీ, యువకులు, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోకూడా రాణించాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.బావనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 5వ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా శనివారం మండలంలోని తూములూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులకు, యువతి, యువకులకు, మహిళలకు ముగ్గులు పోటీలు, మ్యూజికల్ చైర్స్, స్కిపింగ్ తదితర పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సభకు యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి కేదార్నాథ్ అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మొలక శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ఈనాటి తరాన్ని చెడు అలవాట్ల తప్పించేందుకే క్రీడలు అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు స్వర్ణలత, విద్యార్థులు పాల్గొన్నారు.

దామరపల్లిలో బాల మేళా



ఆటల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

దామరపల్లి(తాడికొండ): తాడికొండ మండలం దామరపల్లి గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ఆధ్వర్యంలో బాల మేళా (ఆటల పోటీలు) నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులను లెమన్ అండ్ స్పూన్, లక్కీ సర్కిల్, పిరమిడ్ గేమ్, బెలూన్ బ్లోయింగ్, సర్కిల్ బెలూన్, సర్కిల్ ఇన్ ఆటలను ఆడించి వారికి బహుమతులు ప్రదానం చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ నల్లిబోయిన సరస్వతి మాట్లాడుతూ.. చిన్నారుల్లో మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కో ఆర్డినేటర్ జయరాజు, సిబ్బంది బ్యూలా, సౌభాగ్యం, అంగన్‌వాడీ వర్కర్ నాగమల్లేశ్వరి, ప్రసాద్, దాసు, నాగేశ్వరరావు, భార్గవి, దివ్య, రేవతి పాల్గొన్నారు.

145 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: పొనుగుపాడు గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో శనివారం నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు యానీగ్రేస్ 145 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు ఎత్తు, బరువు, రక్తపరీక్షలు చేసి పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్ఎం, కొర్నేలియా, విజయ్‌కుమార్, సింగరాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.